సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



నైపుణ్యం ఉంటే అపార అవకాశాలు

నైపుణ్యం కలిగిన వారికి అపార అవకాశాలు ఉన్నాయని వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. - 10లో



హోరాహోరీగా మ్యాచ్‌లు

ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల్లో మ్యాచులు సాగుతున్నాయి. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
27.2 /23.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 23.6 - 27.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

తరుముకొస్తున్న తుపాన్

- మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- రైల్వేకోడూరు వద్ద శేషాచలం నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు
- తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూముల ఏర్పాటు
- తడిసిన ధాన్యం కొనుగోలుకు సిద్ధమైన ప్రభుత్వం

మిచాంగ్ తుపాను ముంచుకొస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం తుపాన్ తీరం దాటనున్న నేపథ్యంలో బలమైన ఈదురుగాలులు, వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన అధికారులు.. రెండు జిల్లాల్లోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

కడప అగ్రికల్చర్/సాక్షి రాయచోటి : తుపాను ప్రభావంతో వైఎస్సార్, అన్నమయ్య జిలాల్లో వాన జడిపట్టి కురుస్తోంది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు ప్రాంతంలో భారీ వర్షం నమోదైంది. గుంజనేరు నది నిండుగా ప్రవహిస్తోంది. జనాలు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. బాలుపల్లె వద్ద జాతీయ రహదారిపై శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీరు పారుతుండడంతో కడప–తిరుపతి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా జేసీబీ ద్వారా చెత్తా చెదారాలు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

భారీ వర్షంతో పంట పొలాల్లోకి నీరు

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలతో పంటలు దెబ్బతినే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాయచోటి, పీలేరు, మదనపల్లె తదితర ప్రాంతాల్లో పొలాల్లో చేతికొచ్చే స్థితిలో ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లేలా కనిపిస్తోంది. మరోవైపు కోడూరు ప్రాంతంలో అరటి, బొప్పాయి, మామిడి తోటల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు నెలకొంది. తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. వైఎస్సార్ జిల్లాలో 8 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో అత్యధికంగా సిద్దవటంలో 6.64 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. తుపాను



నిండుగా ప్రవహిస్తున్న గుంజనేరు నది

విద్యాసంస్థలకు నేడు సెలవు

కడప ఎడ్యుకేషన్ : మిచాంగ్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. పిల్లలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకుండా, ముఖ్యంగా నదులు, చెరువులు, వంకల వద్దకు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

కంట్రోల్ రూంలు ఏర్పాటు..

వైఎస్ఆర్ జిల్లాలో..

కలెక్టరేట్ : 08562-246344

ఆర్డీఓ ఆఫీసు, కడప: 08562-295990

ఆర్డీఓ ఆఫీసు, జమ్మలమడుగు: 9502836762

ఆర్డీఓ ఆఫీసు, బద్వేలు: 76708 82856

ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల: 62810 04720

'మిచౌంగ్' తుఫాన్ దృష్ట్యా జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.రాబోయే రెండు రోజుల పాటు బలమైన ఈదురుగాలులు, భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచించిందన్నారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. మిచౌంగ్ తుపాను సహాయక చర్యల నిమిత్తం కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు ఇవి పనిచేస్తాయన్నారు.

అన్నమయ్య జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్

08561-293006



రాయచోటి కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది



రాయచోటి పట్టణంలో కురుస్తున్న వర్షం



కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో కురుస్తున్న వర్షాలపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయి అధికారులు తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయా మండల పరిధిలో ఏవైనా సంఘటనలు చోటు చేసుకొంటే వెంటనే జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ప్రజలకు ప్రాణహాని, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నదులు, వంకలు.. పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పశు సంపద, ధాన్యాన్ని కాపాడుకొనేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, తదితర బిల్డింగుల నిర్మాణాల విషయంలో కుడా అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను ఎక్కడా పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నాడు నేడు పనుల్లో పురోగతి సాధించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా 17 పథకాల అవగాహనపై అందుకు సంబంధించిన సచివాలయం పరిధిలో ఎంఎస్ఓ, ఎంపీడీఓ, కమిషనర్‌లు ప్రిపరేటరీ మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్లాన్ చేసుకొని రిపోర్ట్ చేసి యాప్‌లో పక్కాగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్ఓ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో ఓటర్ల సవరణ జాబితా, జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రయారిటీ బిల్డింగ్స్, నాడు–నేడు పనుల పురోగతి, విద్యాదీవెన, చేయూత, అమ్మ ఒడి, నేతన్న నేస్తం, కాపు నేస్తం, వాహన మిత్ర తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

అన్నివేళలా సిద్ధం : జేసీ

వర్షాల నేపథ్యంలో అధికారులు అన్నివేళలా సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని జేసీ గణేష్ కుమార్ సూచించారు. తుఫానును ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం కలెక్టర్లు, జేసీలు, ఎస్పీ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా, మండలస్థాయిలో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రణాళికాబద్ధంగా సచివాలయ సిబ్బందిని సహాయక చర్యలకు సిద్ధం చేయాలన్నారు. ఈపాటికే జిల్లా కలెక్టరేట్‌తో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

విమాన సర్వీసులు రద్దు

కడప సిటీ : తుపాను కారణంగా మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కడప ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం బయలుదేరే విమాన సర్వీసులు రద్దయినట్లు కడప ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. అలాగే మంగళవారం కూడా అన్ని సర్వీసులను రద్దు చేశామన్నారు.

ఉపకరణాల పంపిణీ వాయిదా

కడప సెవెన్‌రోడ్స్ : తుఫాను ప్రభావం కారణంగా కమలాపురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం అలింకో ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ విజయ్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

'ఆటా' సదస్సుకు ఆహ్వానం



ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి

వైవీయూ : అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈనెల 17న నిర్వహించే అంతర్జాతీయ సాహితీ సదస్సుకు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా॥తప్పెట రామప్రసాద్‌రెడ్డికి ఆహ్వానం లభించింది. 'జానపద దృశ్యకళా రూపాలు–ప్రదర్శనా పద్ధతులు' అన్న అంశంపై ఈయన ఉపన్యసించనున్నారు.

13న క్రీడా పోటీలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం మూడో దశ అంతర్ కళాశాల పోటీలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా॥కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ (పురుషులు, మహిళలు), బెస్ట్ ఫిజిక్ (పురుషుల) క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు 17 నుంచి 25 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి స్టడీ సర్టిఫికెట్, టెన్త్, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 97054 59052 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రౌడీలకు పోలీస్ కౌన్సెలింగ్

కడప అర్బన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కడప, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌లలో ఆయా డీఎస్పీలు, సీఐలు ఈ కార్యక్రమం చేపట్టారు. సద్బుద్ధితో జీవించాలని, అక్రమ కార్యకలాపాలు మానుకోవాలని.. సమస్యలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సు రూట్లలో మార్పులు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. తిరుపతి, నెల్లూరుల నుంచి కడపకు వచ్చు ప్రతి బస్సుతో పాటు బద్వేలు, రాజంపేట వైపు నుంచి వచ్చే ఆర్డినరీ బస్సులు కూడా సబ్ జైలు మీదుగా గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల, కలెక్టర్ ఆఫీస్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ కి వచ్చి పాత బస్టాండుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే కడప నుంచి బయలుదేరు తిరుపతి, నెల్లూరు బస్సులు వయా కొత్త కలెక్టరేట్, ఆర్ట్స్ కాలేజ్, సబ్ జైలు మీదుగా వెళ్లాలన్నారు. అలాగే బద్వేలు, రాజంపేట బస్సులు పాత బస్టాండ్ నుంచి బయలుదేరి కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగ్లా, నెహ్రూ పార్క్, అప్సర సర్కిల్ మీదుగా వెళ్లాలని సూచించారు.

కార్తీకశోభ





పొలతలలో స్వామి,అమ్మవార్ల కల్యాణానికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు, పుష్పగిరిలో భక్తుల సందడి

సాక్షి నెట్‌వర్క్ : కార్తీక మాసంలోని మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు కొత్తకళను సంతరించుకున్నాయి. ఓవైపు వర్షం పడుతున్నా భక్తులు ఆయా క్షేత్రాలకు భారీసంఖ్యలో తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు.

పొలతలలో..

పొలతల క్షేత్రంలో శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతీదేవిల కల్యాణం ఉదయం 10 గంటల నుంచి 12.00 గంటల వరకు నిర్వహించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా ఈ కార్యక్రమం సాగింది. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు.

28,29 తేదీల్లో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్

- 19వ తేదీన చాపాడులో జిల్లాస్థాయి కార్యక్రమం
- విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఈఓ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : విజ్ఞానశాస్త్ర ప్రదర్శన(సైన్సుఫేర్) రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఈ ఏడాది కడప వేదిక కానుంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాలవిద్య కమిషనర్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల స్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు ఈ ఏడాది వైఎస్సార్ జిల్లాలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ, జిల్లా సైన్సు అధికారి మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఎనిమిది అంశాలలో మూడు కేటగిరీలతో విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఈ అంశాల పరిధిలోనే పిల్లలు ప్రాజెక్టులను సిద్ధం చేసుకుని రావాల్సి ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని ఈ నెల 13 లోపల ముగించాలని.. ప్రతి పాఠశాల నుంచి ప్రదర్శన పూర్తి చేసుకుని ఆయా మండల విద్యాశాఖ అధికారులు విజేతల వివరాలను తెలియ పరచాలన్నారు. తదుపరి మండలస్థాయి ప్రదర్శనను 16వ తేదీ లోపల పూర్తి చేసి ప్రతి మండలం నుంచి మూడు కేటగిరీలలో విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా సైన్సు అధికారికి పంపాలన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన తన అధ్యక్షతన చాపాడు మండలం పల్లవోలులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌నందు జిల్లాస్థాయి ప్రదర్శన జరుగుతుందని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతి కేటగిరి నుంచి మూడు ప్రాజెక్టుల చొప్పున మొత్తం 9 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనను కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డిని 9441035830 నంబరులో సంప్రదించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

ప్రకృతికి ప్రణామం

- వ్యవసాయాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు
- ప్రతి మండలంలో 80 శాతం మేర సాగు పెంచే లక్ష్యంతో కృషి
- మోడల్‌గా పెండ్లిమర్రి మండలం ఎంపిక
- స్థానికంగా పండించే ఉత్పత్తులకు అక్కడే మార్కెటింగ్ వసతుల కల్పన
- చిన్న తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు
- మొదలైన అవగాహన సదస్సులు







పెండ్లిమర్రి మండలంలో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటలు (ఇన్‌సెట్) పంట పొలంలో సూచనలు, సలహాలు ఇస్తున్న అధికారులు (ఫైల్)

కడప అగ్రికల్చర్ : రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా ప్రకృతిలో లభించే సహజమైన పదార్థాలతో జీవామృతం, కషాయాలు తదితరాలు తయారు చేసుకుని చేసే వ్యవసాయమే ప్రకృతి వ్యవసాయం. ఈ పద్ధతిలో భూమి ఉన్న రైతులతో పాటు భూమి లేని నిరుపేదలు సైతం తమ ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్ వంటివి ఏర్పాటు చేసుకుని ఆరోగ్యకరమైన కూరగాయలను అందరూ తినడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ప్రకృతి వ్యవసాయాన్ని రానున్న రోజుల్లో మరింత విస్తరింప చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రకృతి వ్యవసాయం 80 శాతం మేర పెంచే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు ముందుగా జిల్లాలోని పెండ్లిమర్రి మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేశారు. దీంతోపాటు లింగాల మండలాన్ని త్వరలో మోడల్‌గా ఎంపిక చేయనున్నారు. ఆయా మండలాల్లో 2027–28 సంవత్సరానికి 80 శాతం మేర ప్రకృతి వ్యవసాయసాగు విస్తరించే విధంగా చర్యలను చేపట్టారు.

13 మండలాల్లో చర్యలు

పెండ్లిమర్రి మండలంలో ఉన్న 19 గ్రామ పంచాయతీలకు 13 గ్రామ పంచాయతీల్లో అందుకు తగ్గ కార్యాచరణను ప్రారంభించారు. ఈ ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లోని డ్వాక్రా మహిళా సంఘాలు, గ్రామ సమైఖ్యలతో పాటు మహిళా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. పంటలు సాగు చేసే రైతులు ఎలాంటి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా వ్యవసాయం చేసేలా వారిలో చైతన్యాన్ని నింపుతున్నారు. దీంతోపాటు ఈ పద్ధతుల్లో పండించే పంటల దిగుబడులను అదే మండలంలో అమ్ముకునే విధంగా మార్కెటింగ్ సదుపాయాలను కూడా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతోపాటు డీఆర్‌డీఏ సహకారంతో చిన్న తరహా కుటీర పరిశ్రమలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇలా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి ముందుకు సాగుతున్నారు.

రక్తహీనతపై సర్వే

ఓవైపు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూనే మరోవైపు సామాజిక కార్యక్రమాలపై కూడా వ్యవసాయ శాఖ దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు నడుం కట్టింది. ఇందుకు సంబంధిత సిబ్బంది సర్వే కూడా చేస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలో ఎంతమంది గర్భవతులు ఉన్నారు, ఎంతమంది రక్తహీనత ఉన్న మహిళలు ఉన్నారు.. ఎంతమంది బాలింతలు, చిన్న పిల్లలున్నారనే విషయమై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. వీరందరికి ప్రకృతి సేద్యం ద్వారా పండించిన చిరుధాన్యాల ఉత్పత్తులను అందుబాటు ధరలలో అందించి వారిలో రక్తహీనతను తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. వీరందరినీ పర్యవేక్షించేందుకు ఒక హెల్త్ అండ్ న్యూట్రీషియనిస్టును కూడా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు.

10 శాతం అధిక ధరతో..

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన దిగుబడులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు ఉంటాయని చాలా మంది రైతులు ఆందోళన చెందుతారు. దీంతోనే చాలామంది ప్రకృతి వ్యవసాయసాగు కు ముందుకు రావడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను అధిగమించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌కంటే 10 శాతం ఎక్కువగా అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను అమూల్, తిరుమల తిరుపతి దేవస్థానం, రిలయన్స్, 24 మంత్ర ఆర్గానిక్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని కొనుగోలు చేయనున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ఇందుకు మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్(ఎంఎంటీ)ను కూడా ఏర్పాటు చేసింది.

సదస్సులు నిర్వహిస్తున్నాం



జిల్లాలోని పెండ్లిమర్రి మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేశాము. ఈ మండలంలో రాబోయే మూడేళ్లలో 80 శాతం మేర ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించే దిశగా చర్యలు చేపట్టాము. దీనిపై ఇప్పటికే గ్రామాల్లోని డ్వాక్రా, గ్రామ సమాఖ్య మహిళలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాము.

- సందీప్, పెండ్లిమర్రి మండల టీమ్ లీడర్.

75 వేల ఎకరాల్లో సాగు



జిల్లాలో ఇప్పటికే 55 వేల మంది రైతులు 75 వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఇది కాకుండా ప్రత్యేకంగా ఒక మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేసి 80 శాతం మేర సాగు పెంచడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. తరువాత జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో 80 శాతం మేర సాగు పెంచేలా కృషి చేస్తున్నాం.

- రామక్రిష్ణమరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వద్ద అధికారులు

చెన్నూరు : చెన్నూరు టౌన్ సచివాలయ పరిధి లోగల రసూల్ బేగ్‌కు చెందిన అద్దె గదిలో అక్రమంగా సేకరించి ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా, బాలగంగాధర్ రెడ్డి తెలిపారు. సోమవారం వీరు 115 బస్తాలలో రవాణాకు సిద్ధంగా ఉన్న 5,666 కిలోల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని గుర్తించారు. చెన్నూరుకు చెందిన కొండూరు హరిక్రిష్ణ అనే వ్యక్తి తన యజమాని చెన్నూరు టౌన్‌కు చెందిన కాటం వీరబ్రహ్మయ్య ఆదేశాల మేరకు చెన్నూరు చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి వాటిని అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ. 2,35,139 ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చెన్నూరు సీఎస్ డీటీ మనోజ్‌కు అప్పగించి ఈ అక్రమ రవాణాకు సహకరిస్తున్న చెన్నూరుకు చెందిన కాటం వీర బ్రహ్మయ్య, కొండూరు హరిక్రిష్ణలపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మురళీకృష్ణ, చెన్నూరు ఎస్‌ఐ శ్రీనివాసులు, విజిలెన్స్ కానిస్టేబుల్ నాగేశ్వర రావు, రంతుబాషా పాల్గొన్నారు.

కారు, బైకు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ బాబా ఫక్ృద్దీన్‌ను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

తొండూరు : ముద్దనూరు – పులివెందుల ప్రధాన రహదారిలోని మల్లేల ఘాట్ సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం పులివెందులలో విందు వేడుకకు హాజరై ముద్దనూరుకు వెళుతుండగా.. మల్లేల ఘాట్ సమీపంలోకి రాగానే మలుపు వద్ద కారు, బైకు ఢీకొన్నాయి. దీంతో పులివెందులకు చెందిన సిలార్‌బీ, బాబా ఫక్రుద్దీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ క్షతగాత్రులను పరామర్శించారు.

సౌకర్యవంతంగా రిజిస్ట్రేషన్ సేవలు

- రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసిన ప్రభుత్వం
- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కార్డు ప్రైమ్ 2.0 విధానం
- ఇరవై నిమిషాల వ్యవధిలోపే ప్రక్రియ పూర్తి
- ఇప్పటికే వైఎస్సార్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



కడపలోని రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలను సరళతరం చేసింది. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా క్రయ విక్రయదారులకు కచ్చితమైన సేవలు అందించేలా కార్డు ప్రైమ్ 2.0 ద్వారా నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని వైఎస్సార్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే ప్రారంభించారు. అయితే అన్నమయ్య జిల్లాలో గత మంగళవారం నుంచి ఈ నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ నూతన విధానంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారుడే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను తయారు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో సూచించిన మేర స్టాంపు డ్యూటీ, యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే ప్రక్రియ సులభంగా జరిగిపోతుంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివి బయటే చేసుకునేవారు. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పిస్తే రిజిస్ట్రేషన్ చేస్తూ వచ్చారు. అయితే ఈ ప్రక్రియ పెద్ద ప్రహసనంగా ఉండేది. పైగా మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉండేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలకు స్వస్తి పలుకుతూ కార్డ్ ప్రైమ్ 2.0 అనే నూతన విధానాన్ని తీసుకొచ్చింది.

12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

వైఎస్సార్ జిల్లాలో కడప అర్బన్, రూరల్, సిద్దవటం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, దువ్వూరు, కమలాపురం, వేంపల్లె, పులివెందుల, బద్వేలులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో గత నెల 14వ తేదీ నుంచి 2.0 కార్డు ప్రైమ్ నూతన విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఈ విధానంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. దీంతో ఇప్పటివరకు జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కార్డ్ ప్రైమ్ 2.0 విధానం ద్వారా 2051 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

అన్నమయ్య జిల్లాలో..

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పుల్లంపేట, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లె, మదనపల్లె, వాయల్పాడు, బి.కొత్తకోట, పీలేరు, తంబళ్లపల్లె కలికిరిలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో గత మంగళవారం నుంచి కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్డు ప్రైమ్ 2.0 విధానం ద్వారా చాలా సులభంగా డాక్యుమెంట్లను తయారు చేసుకోవచ్చు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్ వంటి సమాచారాన్ని ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తికి సంబంధించిన మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో స్క్రీన్‌పైనే చూపుతుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లోగానీ లేదా ఆఫ్ లైన్‌లోగానీ స్టాక్ హోల్డింగ్ ద్వారా చలానా కట్టవచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్, శ్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సరిపోతుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఇందుకోసం దాదాపు 20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. అంతకుముందు అయితే రోజంతా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉండాల్సి వచ్చేది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో కార్డు ప్రైమ్ 2.0 విధానం ద్వారా ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లు

ప్రాంతం	జరిగిన రిజిస్ట్రేషన్లు
కడప అర్బన్	220
కడప రూరల్	313
బద్వేలు	92
జమ్మలమడుగు	181
కమలాపురం	154
ప్రొద్దుటూరు	517
మైదుకూరు	153
ముద్దనూరు	45
పులివెందుల	145
వేంపల్లె	115
దువ్వూరు	71
సిద్దవటం	45
మొత్తం	2051

సద్వినియోగం చేసుకోవాలి



కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని క్రయ, విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి. భూములు, ఆస్తుల విక్రయాల్లో పారదర్శకతను పెంచి ఆస్తులను పరిరక్షించేందుకు కొత్త విధానం ఎంతో దోహదపడుతుంది. క్రయ విక్రయదారులు దస్తావేజును స్వతహాగా ఎవరికి వారే తయారు చేసుకుని ఎక్కడ కావాలంటే అక్కడ రిజిస్ట్రేషన్ శ్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. సులువుగా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అపోహాలు వీడి ఈ నూతన విధానానికి డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు సహకరించాలి.

– జి.శివరాం, డీఐజీ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, కడప

హోరాహోరీగా మ్యాచ్‌లు



కేఓఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న సౌత్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్–23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కేఓఆర్‌ఎం మైదానంలో 171 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు రెండోరోజు సోమవారం 64.4 ఓవర్లలో 201 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాకేత్‌రామ్ 35 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ వై. వాసు 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది. జట్టులోని జయంత్ 23 పరుగులు చేశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 65 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 49.1 ఓవర్లలో 207 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆశిష్‌రెడ్డి 40 పరుగులతో క్రీజులో నిలిచాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు రుకేష్‌బాబు 4, నవీన్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 7 పరుగులు చేసింది. కాగా సెంట్రల్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.



5 వికెట్లు తీసిన నార్త్‌జోన్ బౌలర్ వాసు



4 వికెట్లు తీసిన సెంట్రల్‌జోన్ బౌలర్ నవీన్



4 వికెట్లు తీసిన రుకేష్‌బాబు

బైకును ఢీకొన్న కారు

బి.కొత్తకోట : బైకును కారు ఢీకొన్న ఘటన సోమవారం ఉదయం జరిగింది. బి.కొత్తకోట మండలం బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన బయ్యప్ప, విమలమ్మ గడ్డి కోసం బైక్‌పై కొత్తపల్లెకు వెళుతున్నారు. కొత్తపల్లె వద్ద మలుపు తిరుగుతుండగా, మదనపల్లె నుంచి బి.కొత్తకోట వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామారిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రమేష్(30) కుటుంబసమస్యల కారణంగా ఇంటివద్దే విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మ ఒడితో చదివిస్తున్నాం



నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వెంకట సుమంత్ 5వ తరగతి, వెంకట సందీప్ 3వ తరగతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. పెద్ద కుమారుడికి జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు అందుతోంది. దీంతోనే చదివించగలుగుతున్నాం. ప్రభుత్వం మాకు ఎంతో అండగా ఉంది. మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలి.

– జగతి కిరణ్ కుమార్, సీతంపల్లె, ప్రొద్దుటూరు మండలం

పింఛన్ రావడం చాలా ఆనందంగా ఉంది



ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న నాకు 5 ఏళ్ల క్రితం పక్షవాతం రావడంతో ఇంటికి పరిమితమయ్యాను. నాకు భార్యతోపాటు పిల్లలు ఉన్నారు. నా భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. జగనన్న సురక్షలో పింఛన్ కోసం దరఖాస్తు చేసిన మూడు నెలల వ్యవధిలోనే జగనన్న ప్రభుత్వంలో పింఛన్ రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందించే పింఛన్ డబ్బులు కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాయి. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను.

– శ్రీనివాసులు, గాంధీనగర్, పులివెందుల

ఇల్లు కట్టుకుంటున్నాం



కూలి పనులు చేసుకుంటేనే మాకు జీవనం. సొంత ఇల్లు లేదు. ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో మా గ్రామ సర్పంచ్ మోపూరి కిరణ్ కుమార్ రెడ్డి, వలంటీర్ హరీష్ వచ్చి ఇంటికోసం దరఖాస్తు చేయించారు. స్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. అన్ని వసతులతో కట్టుకుంటున్నాం. జగన్ సార్‌కు రుణపడి ఉంటాం. అలాగే మాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందుతోంది. మా కోడలికి అమ్మఒడి డబ్బులు వస్తున్నాయి. ఇన్ని పథకాల ద్వారా మాకు మేలు జరుగుతుండటం ఎంతో సంతోషంగా ఉంది. ఇంతకంటే ఏం కావాలి.

– కుటుంబ సభ్యులతో బాలసుబ్బయ్యగారి సుబ్బయ్య, రామాంజనమ్మ, గండికొవ్వూరు, చక్రాయపేట మండలం

ఏపీ భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి



న్యాయవాదుల నిరసన ర్యాలీ

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం–2022ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రజాసంఘాలు కడప నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, రాజీవ్‌పార్క్ సర్కిల్, ఎల్‌ఐసీ క్వార్టర్స్, మహావీర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ భూహక్కు చట్టం వలన ప్రజల స్థిరాస్తి హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఈ చట్టం ద్వారా ఆస్తిహక్కును నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేసి రెవెన్యూ అధికారులను ట్రిబ్యునల్ చైర్మన్‌లుగా పెట్టి వారికి అప్పగించారన్నారు. ఈ ట్రిబ్యునల్ సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్, లిమిటేషన్ యాక్ట్‌లతో సంబంధం లేకుండా కేవలం సహజ న్యాయసూత్రాల ఆధారంగా టైటిల్‌ను డిసైడ్ చేస్తారన్నారు. ఈ సహజ న్యాయసూత్రాలకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి చట్టాలు రూపొందించలేదన్నారు. ఈ ట్రిబ్యునల్ వ్యవస్థ ద్వారా ప్రజల ఆస్తి హక్కులు పెత్తందారులు, రాజకీయనాయకులు, రాజకీయపార్టీల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి టీజే కెనడీ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, ఐఏఎల్ కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు సి. సుబ్రమణ్యం పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

శభాష్ .. వెంకటసుబ్బయ్య !

ఆటోలో మర్చిపోయిన బంగారు ఆభరణాల బ్యాగును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఆటో డ్రైవర్



ఆటోడ్రైవర్ వెంకటసుబ్బయ్యకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : ఓ మహిళ ఆటోలో వెళుతూ రూ. 2లక్షలు విలువైన బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగును మరచిపోయింది. ఆటోలో బ్యాగును గుర్తించిన డ్రైవర్ వెంకట సుబ్బయ్య పోలీస్ స్టేషన్‌లో అప్పగించి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ నల్లకట్ల వెంకట సుబ్బయ్యకు ప్రశంసాపత్రాన్ని అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన మేరువ వెంగమ్మ జంగాలపల్లెలోని తన తల్లి ఇంటికి శుభకార్య నిమిత్తం వచ్చింది. ఈనెల 2న కమ్మపల్లెకు వెళ్లి సాయంత్రం ఆటోలో జంగాలపల్లెకు తిరుగు ప్రయాణమైంది. ఈ నేపథ్యంలో ఆటోలో బంగారు నగలున్న బ్యాగును మరిచిపోయింది. బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ వెంటనే సమీపంలోని సిద్దవటం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజుకు అందజేశారు. బాధిత మహిళకు పోలీసులు సమాచారం ఇచ్చి నగలతో కూడిన బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆటో డ్రైవర్‌కు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

తనయుడి చేతిలో తండ్రి హతం

ఓబులవారిపల్లె : కుటుంబ సమస్యల కారణంగా కన్నతండ్రినే దారుణంగా హతమార్చిన సంఘటన సోమవారం మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసు స్టేషన్ సమీపంలో నివాసముంటున్న సయ్యద్ మహమ్మద్(60) తమలపాకు తోటల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వారం రోజుల నుంచి కుటుంబ సమస్యలతో మహమ్మద్‌కు అతని కుమారుడు సయ్యద్ మహబూబ్‌బాషాకు మధ్య గొడవ జరుగుతోంది. ఈనేపథ్యంలో సోమవారం కూడా వీరి మధ్య ఘర్షణ జరిగింది. తన వెంట తెచ్చుకున్న కర్రతో మహబూబ్‌బాషా తండ్రి తలపై బలంగా కొట్టాడు. దీంతో మహమ్మద్‌కు తల పగిలి రక్తపు మడుగులో పడిపోయాడు. అతని భార్య గోరి కేకలు వేయడంతో పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

నైపుణ్యం ఉంటే అపార అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య

వైవీయూ : నైపుణ్యం కలిగిన వారికి అపార అవకాశాలు ఉన్నాయని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో 'కెరీర్ అభివృద్ధి కోసం ఉపాధి నైపుణ్యాలు' అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉద్యోగ నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనం కోసం జాతీయ విద్యావిధానం–2020ని అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. డిగ్రీ విద్యార్థులకు 10 నెలల ఇంటర్న్‌షిప్ అమలు చేస్తూ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తోందన్నారు. అకడమిక్ మార్కులు ఇంటర్వ్యూ వరకు తీసుకెళ్లగలవని, ఉద్యోగ ఎంపికకు స్కిల్స్ కీలకమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో ఉద్యోగ నైపుణ్యాలు కీలకమన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ఎస్.ఆర్. క్రియేటివ్ మైండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ కె. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కెరీర్ డెవలప్‌మెంట్, ఉపాధి నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'మిషన్ 1000' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ నిర్వాహకులు డాక్టర్ పి. సరిత, డాక్టర్ కె. లలిత, డాక్టర్ వి. లాజరస్, డాక్టర్ కె. రియాజున్నీసాలు వర్క్‌షాప్ ప్రాధాన్యత, స్కిల్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్.ఆర్. క్రియేటివ్ మైండ్స్ ప్రతినిధులు హరిణిరెడ్డి, హర్షిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమలలో గుండెపోటుతో అయ్యప్ప భక్తుడు మృతి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ (45) అనే అయ్యప్పస్వామి భక్తుడు శబరిమలలో గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లిలోని కుర్నూతల బ్యాంకు వీధిలో నివాసం ఉంటున్న వెంకటేష్ 15 రోజుల క్రితం అయ్యప్పస్వామి మాల ధరించాడు. ఈనెల 2వ తేదీ శనివారం అయ్యప్ప కొండకు బయలుదేరాడు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ సోమవారం శబరిమల కొండ ఎక్కే సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న అయ్యప్పస్వామి భక్తులు బంధువులకు సమాచారం అందజేశారు. మృతుడు వెంకటేష్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు 18 సంవత్సరాల క్రితం వివాహమైంది. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మృతుని భార్య, పిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.